నమస్తే తెలంగాణ

# మెదక్

I | హైదరాబాద్, ఆదివారం 3 నవంబర్ 2024 | MEDAK


## తాతకు సాయంగా...



కౌడిపల్లి, చిలిపిచెడ్ ప్రధానరోడ్డుపై వర్షానికి తడిసిన ధాన్యాన్ని తాతతో కలిసి ఆరబెడుతున్న మనుమండ్లు

మెదక్ జిల్లాలో గురు, శుక్రవారాల్లో కురిసిన వర్షానికి ధాన్యం తడిసిముద్దయింది. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడంతో రైతులు బిజీగా మారారు. చిలిపిచెడ్ మండలం సోమక్కపేట గ్రామ శివారులో కౌడిపల్లి–చిలిపిచెడ్ ప్రధాన రోడ్డుపై ధాన్యం ఆరబెట్టేందుకు తాతకు మనుమండ్లు సాయపడ్డారు. తడిసి కుప్పగా ఉన్న వడ్లను తాత నేర్పుతుండగా.. ధాన్యాన్ని పార, గంపతో నేర్చుకునే పనిలో మనుమండ్లు సాయపడ్డారు.

– చిలిపిచెడ్, నవంబర్ 2

## భానుడి కిరణం..చిన్నారికి ప్రాణం



మనుషుల్లో ఎముకలు ధృడంగా మారడానికి రోగ నిరోధక శక్తి పెంచడానికి, ఎదుగదలకు విటమిన్–డి ఎంతగానో దోహదపడుతుంది. సూర్యుడి నుంచి ఉదయం 6:30 నుంచి 7:15 గంటల మధ్య వెలువడే కిరణాలు మనిషి ఒంటిపై పడితే విటమిన్–డి శరీరంలోకి చేరుతుందని వైద్యులు చెబుతుంటారు. శనివారం సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన ఆవరణలో నవ జాత శిశువులపై సూర్యరశ్మి ప్రసరించడానికి వారి కుటుంబసభ్యులు ఒడిలో పెట్టుకుని లాలిస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్
సిద్దిపేట, నవంబర్ 2

# ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం



దుబ్బాక మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

### దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

దుబ్బాక, నవంబర్ 2: వానకాలం వడ్ల కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం దుబ్బా క మార్కెట్ యార్డును సందర్శించి ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మను చౌదరితో ఫోన్‌లో మాట్లాడారు. ధాన్యాన్ని త్వరిత గతిన కొనుగోలు చేయాలని కోరారు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని కలెక్టర్ చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేరుకే దుబ్బాక నియోజకవర్గంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని, ఎక్కడా రైతుల నుంచి గింజ ధాన్యం కొనుగోలు చేయలేదని మండిపడ్డారు. అకాల వర్షాల కారణంగా సెంటర్లలో ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. అనంతరం 66 మంది బాధితులకు రూ.16,50 లక్షల సీఎంఆర్ ఎఫ్ చెక్కులను అందజేశారు. దుబ్బాక కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకుడు బట్టు ఎల్లం తండ్రి బాలమల్లు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెలే వెంట బీఆర్ఎస్ నాయకులు ఎల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

**ధాన్యం కొనకపోతే ఆందోళనలు**

మెదక్,అక్టోబర్, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ): సోమవారంలోగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించక పోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ఆందోళనలు చేస్తామని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని హెచ్చరించా రు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ..కొబ్బరికాయలు కొడుతూ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి చేతులు దులిపేసుకోవడం కాదని, త్వరితగతిన ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. వానలకు ధాన్యం తడిసి రైతులు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు లేదని విమర్శించారు. పంట రుణమాఫీ చేస్తామని చెప్పి రైతులను నిండా ముంచిందన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచిందన్నారు. బీఆర్ఎస్ సర్కారు రైతులకు చేయూతనిస్తే, కాంగ్రెస్ రైతులను మోసం చేస్తున్నదని పద్మాదేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



రాంపూర్ గ్రామంలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

## ధాన్యం కొనుగోలు చేయాలని నిరసన

నంగునూరు, నవంబర్ 2: కొనుగోలు కేంద్రం ప్రారంభించి 15 రోజులు గడిచినా ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు నిరసన తెలిపిన ఘటన మండలలోని రాంపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. మండలంలో నంగునూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో 5, పాలమాకుల పీఏసీఎస్ ఆధ్వర్యంలో 13, ఐకేపీ ఆధ్వర్యంలో 7 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కానీ, ఇప్పటికీ ధాన్యం కొనుగోలు ప్రారంభం కాలేదని రైతులు మండిపడ్డారు. అధికారులతో మాట్లాడి వెంటనే ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రాంపూర్ బీఆర్ఎస్ నాయకుడు పరశురాములు కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ధాన్యం కొనుగోలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని, ఇప్పటికే సగానికి పైగా ధాన్యం దళారులకు అమ్ముకున్నామని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ధాన్యం కొనుగోలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.



సిర్గాపూర్‌లో తడిచి వడ్లను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

## వడ్లు కొనడం చేతకాకపోతే రాజీనామా చేయాలి

### ప్రభుత్వ తీరుపై మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆగ్రహం

సిర్గాపూర్, నవంబర్ 2 : వానకాలం వడ్లు కల్లాల్లోనే అకాల వర్షానికి తడిచి ముద్దవుతున్నా ఇప్పటికీ కాంగ్రెస్ సర్కారు కొనుగోలు చేయడం లేదని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి విమర్శించారు. శనివారం సిర్గాపూర్ మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లో రోడ్డుపై ఆరబెట్టిన వడ్లను చూసి రైతులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ ఎంపీటీసీలు సంజీవరావు, శాంతాబాయితో కలిసి మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే ప్రతి గ్రామానికి వెళ్లి కొబ్బరికాయ కొట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నారే తప్పా...ఇప్పటికీ రైతు నుంచి ఒక్క క్వింటాల్ వడ్లు కొనలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అన్నివిధాలా మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదన్నారు. ప్రతి క్వింటాలకు రూ.500 బోనస్ ఇస్తామని విస్మరించారన్నారు. వడ్ల కొనుగోలు చేతకాకపోతే వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌కు ఓట్లు వేసి పెద్ద తప్పు చేశామని రైతులు, ప్రజలు వాపోతున్నారని చెప్పారు. ధాన్యం సకాలంలో కొనుగోలు చేయాలని, బోనస్ ఇవ్వాలని, లేకపోతే ప్రజల చేతిలో కాంగ్రెస్ నాయకులకు గుణపాఠం తప్పదని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరావు, రైతులు శాంతాబాయి తదితరులు ఉన్నారు.



మునిపల్లి ఎంపీడీవోకు వినతిపత్రం అందిస్తున్న చీలపల్లి బీఆర్ఎస్ నాయకుడు నాగేశ్ (ఇన్‌సెట్‌లో) చీలపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో నరివేసిన చెట్లు

## చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

మునిపల్లి, నవంబర్ 2: మండలంలోని చీలపల్లి ప్రభుత్వ పాఠశాలలో చెట్లు నరికిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు పిల్లోడి నగేశ్ శనివారం మునిపల్లి తహసీల్దార్, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో ఎన్నో ఏండ్ల నుంచి పెంచిన చెట్లనుగ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సంబంధిత అధికారులతో కుమ్మక్కై నరికివేసినట్లు నగేశ్ తెలిపారు. అధికారులకు సమాచారం ఉన్నప్పటికీ చర్యలు తీసుకోవడం లేదన్నారు. పాఠశాల హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శికి సైతం ఎలాంటి సమాచారం అందించకుండా చెట్లు సరికారని, తక్షణమై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. చీలపల్లి పాఠశాలలో నరికిన చెట్లను లారీలో తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకోవడానికి ప్రయత్నించారు. పంచాయతీ కార్యదర్శి ఎంపీడీవోకు ఫోన్ చేసి సమాచారం అందించారు. లారీని ఆపొద్దని, తక్షణమే పంపించాలని ఎంపీడీవో కార్యదర్శికి చెప్పారని, దీంతో ఆయన లారీని వదిలిపెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. ఆ చెట్లను ఎవరికి తెలియకుండా నరికి తరలించడంపై ఎంపీడీవో ఎందుకు ఉత్సాహం చూపుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు.

# ప్రభుత్వ వైఫల్యంతో రైతులకు తీరని నష్టం

### నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

కొల్చారం, నవంబర్ 2: కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శనివారం ఆమె మండలంలోని వరిగుంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బూతిపురం శేకులు తండ్రి వెంకాగౌడ్ దశదిన కర్మకు హాజరై వారి కుంటుంబాన్ని పరామర్శించారు. మరో నాయకుడు యాటా గోవర్ధన్ ఇటీవల గుండెపోటుతో మరణించగా, వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు రైతులు గోడును వెళ్లబోసుకున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లు వెంట వెంటనే జరిగాయని, రైతుబంధు పైసలు పంట పెట్టుబడులకు అందేవని గుర్తుచేశారు. ఇప్పుడు ధాన్యం తెచ్చి ఇరవై రోజులు గడుస్తున్నా ఇంకా తూకం వేయడం లేదని, ధాన్యాన్ని కప్పి ఉం చేందుకు తెచ్చిన టార్పాలిన్లు కిరాయి వేలు దాటుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షానికి తడిసిన ధాన్యాన్ని రోజూ ఆరబెడుతూ కొనుగోలు కేంద్రంలోనే గడపాల్సి వస్తున్నదన్నారు. అనంతరం వర్షానికి తడిసి మొలకలు వచ్చిన ధాన్యాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తూ జాప్యం చేస్తుండడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. కోత లు మొదలై నెల కావస్తున్నా ప్రభుత్వం ఇంకా రైస్‌మిల్లులు కేటాయించలేదన్నారు. గన్నీ బ్యాగులు సైతం రాలేదన్నారు. అటు మిల్లర్లకు బ్యాంకు హామీలు ఇవ్వాలని నిబంధన పెట్టడంతో వారు ముందుకు వచ్చే పరిస్థితి లేదన్నారు. గతంలో మిల్లర్లు దొడ్డురకం క్వింటాల్‌కు 68 కిలోలు ప్రభుత్వానికి ఇచ్చారని, ఇప్పుడు సన్నరకం కూడా 68 కిలోలు ఇవ్వాలని ప్రభుత్వం కోరగా, సన్నరకం క్వింటాల్‌కు 58 కిలోలు మాత్రమే వస్తుందని, తాము నష్టపోతామని మిల్లర్లు జంకుతున్నారని తెలిపారు. ఇటు సన్నాలను గుర్తించేందుకు మిషన్ ఏర్పాట్లు చేశారని, అందులో నుంచి జారిన ధాన్యాన్నే సన్నాలుగా గుర్తిస్తామంటున్నారని పేర్కొన్నారు. ఇది సన్నాలు రైతులను వడబోసి మోసం చేసే కుట్ర అని విమర్శించారు. పంట పెట్టే ముందు లేని నిబంధన ఇప్పుడు ఎందుకని ప్రశ్నించారు. భేషరతుగా అన్ని రకాల వడ్లకు బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ధాన్యం తరలించకుంటే రైతులతో కలిసి ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట ముత్యంగారి మేఘమాలాసంతోష్ కుమార్, పాశం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, ముత్యం ప్రవీణ్, గూడాల నర్సింహులు ఉన్నారు.

## తిట్టడంలో ఉన్న శ్రద్ధ ధాన్యం కొనడంలో లేదు

### ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి



చిట్‌చాట్‌లో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, నవంబర్ 2(నమస్తే తెలంగాణ): ప్రతిపక్షాలను తిట్టడంతో ఉన్న శ్రద్ధ సీఎం రేవంత్, మంత్రులకు ధాన్యం కొనుగోలులో లేదని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి అన్నారు. శనివారం మెదక్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో జర్నలిస్టులతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కేసీఆర్ ధాన్యం కొన్నట్లు గుర్తుచేశారు. కరోనా లాంటి కష్ట సమయంలోనూ గ్రామాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం తూకం వేశారన్నారు. 72 గంటల్లో రైతుల అకౌంట్‌లో నగదు జమ చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కొబ్బరికాయలు కొట్టి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం కాదని, ధాన్యాన్ని తూకం వేసి అకాల వర్షాల నుంచి రైతులను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ధాన్యాన్ని కోసి నెల రోజులు గడుస్తున్నా తూకం వేయకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరకే ధాన్యాన్ని అమ్ముకుంటూ నష్టపోతున్నారన్నారు. వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని, హైడ్రా,మూసీ సుందరీకరణ అంటూ హడావిడి చేయడం తప్పా ప్రజలకు చేసిన మేలు ఏమి లేదని శేరి సుభాశ్‌రెడ్డి విమర్శించారు. పౌరసరఫరాల శాఖ, రైస్ మిల్లర్స్‌కు మధ్య సమన్వయం లేక కేంద్రాల్లో ధాన్యం తూకంలో జాప్యం జరుగుతోందన్నారు. యాసంగి పంట వేయాలా వద్దా అనే అయోమయ స్థితిలో రైతులు ఉన్నారని తెలిపారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టుకే లక్ష కోట్ల రూపాయలు దాటలేదు, కానీ.. మూసీ సుందరీకరణకు లక్షా యాభై వేల కోట్లతో చేయడంలో ఆంతర్యమేమిటో ప్రభుత్వం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఇస్తున్నారని ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఈ ప్రభుత్వానికి నిర్దిష్టమైన ప్రణాళిక లేక తెలంగాణను ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుభరోసా, పంట రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయాలని ఆయన డిమాండ్ చేశారు.



బెంగళూర్‌లో సీఎం సిద్దిరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న నర్సింహులు గౌడ్, (ఇన్‌సెట్‌లో) జానపద సంగీత అంధ కళాకారుడు నర్సింహులు గౌడ్(ఫైల్)

## డప్పూర్ వాసికి కర్ణాటక రాజ్యోత్సవ అవార్డు

జహీరాబాద్, నవంబర్ 2: కర్ణాటక ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందజేసే కర్ణాటక రాజ్యోత్సవ అవార్డును సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం డప్పూర్ గ్రామానికి చెందిన జానపద సంగీత అంధ కళాకారుడు నర్సింహులు గౌడ్‌కు లభించింది. కర్ణాటకలో జానపద సంగీత కళారంగంలో విశేష కృషిచేసినందుకు శుక్రవారం బెంగళూర్‌లోని విధాన సభ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో సీఎం సిద్ధిరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. అవార్డుతోపాటు రూ. 5లక్షల నగదు, రెండు తులాల బంగారు గొలుసు అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నర్సింహులు గౌడ్ మాట్లాడుతూ..అవార్డు రావడం సంతోషంగా ఉందని, ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. జానపద సంగీత కళారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. నర్సింహులు గౌడ్‌ను డప్పూర్ గ్రామస్తులు అభినందించారు.


# కమిషనర్ ఆదేశాలు బేఖాతరు

- ఎల్లమ్మ ఆలయం వద్ద అనుమతి లేకుండా టెంకాయల విక్రయం
- లక్షల ఆదాయంపై పట్టింపులేని ఆలయ అధికారులు



సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయం

చేర్యాల, నవంబర్ 2: అధికారుల తీరుతో సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లన్న ఆలయ ఖజానాకు ఆదాయం గండిపడుతున్నది. కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని ఎల్లమ్మ టెంపుల్ వద్ద టెంకాయల విక్రయానికి తక్కువ ధరకు టెండర్ పాడడంతో ఇటీవల దేవాదాయశాఖ కమిషనర్ ఆ టెండర్‌ను రద్దు చేశారు. ఈ టెండర్‌ను తక్కువ ధరకు పాడిన వారే ప్రస్తుతం ఆలయం వద్ద కొబ్బరికాయలు విక్రయిస్తుండడంతో ఆలయ ఆదాయానికి నష్టం చేకూరుతున్నది. మల్లన్న ఆలయానికి సంబంధించి కొబ్బరికాయల విక్రయం, తలనీలాల సేకరణ, స్వామి వారికి భక్తులు సమర్పించే కొబ్బరికాయల ముక్కల సేకరణతోపాటు ఆదాయాన్ని తెచ్చిపెట్టే వాటికి ఏటా ఆలయ అధికారులు టెండర్లు నిర్వహిస్తారు. టెండర్ ఎక్కువ ధరకు పాడిన వారికి లేదా సంస్థలకు హక్కులు అప్పగిస్తారు. ఈసారి టెండర్‌లో ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు విక్రయించుకునే టెండర్‌తో పాటు తలనీలాల సేకరణ టెండర్లకు ఆలయవర్గాలు ఆశించిన స్థాయిలో టెండరుదారులు పాట పాడలేదు. గతేడాది నిర్వహించిన టెండర్‌లో రూ.20లక్షల మేరకు పాటను పాడి హక్కులు పొందారు. ఈసారి నిర్వహించిన టెండరులో కొందరు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడడంతో కేవలం రూ.12లక్షలు మాత్రమే టెండరు పాట పాడారు దీంతో రెండు టెండర్లు దేవాదాయశాఖ కమిషనర్ రద్దు చేశారు. ఆలయానికి సంబంధించిన నిర్వహించిన టెండర్లు సెప్టెంబర్ 1 నుంచి అమలులోకి వచ్చాయి. కానీ, తలనీలాలు, గుట్టపైన ఉన్న ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయల విక్రయ టెండర్లు మాత్రం ఖరారు కాలేదు. దీంతో ఆలయ అధికారులు స్వామి వారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించుకున్న తలనీలాలను సేకరించి భద్రపరిచి ఇటీవల రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యాలయంలో జరిగిన టెండర్లలో కిలోకు రూ.8100 చొప్పును కొనుగోలు చేసేందుకు ఓ వ్యాపారి ముందుకు రావడంతో ఆయనకు లైసెన్స్ హక్కులను అప్పగించారు. ఇదే పద్ధతిని కొబ్బరికాయలు విక్రయం టెండరు ఖరారు చేస్తే ఆలయానికి ఆదాయం సమకూరేది. ఆలయ ఈవో మళ్లీ టెండరు నిర్వహించినా ఎవరూ ముందుకు రాలేదని తక్కువ ధరకు టెండరు పాడిన వారికి కొబ్బరికాయల విక్రయ హక్కులు కల్పించాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు నివేదించారు. దీనిని కమిషనర్ తిరస్కరించారు. మరోసారి టెండరు నిర్వహించాలని ఆదేశించారు. కానీ, ఆలయ అధికారులు టెండరు ముగిసిన తేదీ నుంచి ఇప్పటి వరకు మరో టెండరు నిర్వహించలేదు. దీంతో ఎల్లమ్మ ఆలయం వద్ద ఇష్టారాజ్యంగా కొబ్బరికాయలను టెండరు ఖరారు కాని వ్యక్తులు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఆలయ ఆదాయం పెంచేందుకు కృషి చేయాల్సిన అధికారులు కిమ్మనకుండా ఉండడంపై ఆరోపణలు వస్తున్నాయి. ఎల్లమ్మ ఆలయం వద్ద రూ.40,రూ.50వరకు కొబ్బరికాయలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో బాలాజీని ఫోన్‌లో వివరణ కోరగా.. తక్కువ ధరకు టెండరుపాడిన వ్యక్తి రూ.10లక్షలు చెల్లించాడని, టెండరు పాటపాడిన రోజు నుంచి ఇప్పటి వరకు కొబ్బరికాయలు విక్రయిస్తున్న వ్యక్తి నుంచి ప్రతి నెలా రూ.లక్ష చొప్పున వసూలు చేస్తామని తెలిపారు.




## కమ్ముకున్న పొగమంచు

ఉమ్మడి జిల్లాల్లో శనివారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఇండ్లు, చెట్లు, వాహనాలపై మంచు తుంపర్లు కురిశాయి. శీతల గాలులు వణికించాయి. పొగమంచు ధాటికి రోడ్లపై ఏమి కనిపించకపోవడంతో వాహనదారులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణించారు. ఉదయం పూట వివిధ పనులకు వెళ్లేవారు, వాకర్లు ఉన్ని దుస్తులు ధరించారు. చలి నుంచి రక్షణకు ఉదయం పూట వేడివేడి టీ తాగి ఆస్వాదించారు.

– నమస్తే తెలంగాణ ఫొటోగ్రాఫర్లు సిద్దిపేట/సంగారెడ్డి, నవంబర్ 2






మన్నె ఆంజనేయులు, మన్నె లావణ్య, సహస్ర, శాన్విక (ఫైల్)

## శుభకార్యానికి వెళ్తుండగా మృత్యువాత

### ట్రాక్టర్ ఢీకొని నలుగురి దుర్మరణం

మనోహరాబాద్, నవంబర్ 2: బంధువుల ఇంట్లో శుభకార్యానికి బయలుదేరిన కాసేపటికే ట్రాక్టర్ రూపంలో ఆ కుటుంబాన్ని మృత్యువు కబలించింది. ఒకే ఇంట్లో నలుగురు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పోలీసుల వివరాల ప్రకారం... మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన మన్నె కుమార్, లావణ్య దంపతులకు సంజన, సహస్ర, శాన్విక ముగ్గురు సంతానం. వీరిలో మన్నె లావణ్య (30), ఆమె పిల్లలు సహస్ర (7), శాన్విక (6) సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం మజీద్‌పల్లిలో బంధువుల ఇంట్లో ఆదివారం జరిగే శుభకార్యానికి శనివారం రాత్రి 7 గంటల సమయంలో బయలుదేరారు. వీరిని లావణ్య బావ మన్నె ఆంజనేయులు(46) తన ద్విచక్ర వాహనంపై శభాష్‌పల్లి బస్టాప్ వద్ద దించేందుకు బయలుదేరాడు. గ్రామ శివారులో రైతులు రోడ్లపై వడ్లు ఆరబోసి ఎలాంటి హెచ్చరికలు ఏర్పాటు చేయకుండా ఉంచారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో నలుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఘటనా స్థలానికి చేరుకొని పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుభాష్‌గౌడ్ తెలిపారు.